

# బ్లాక్ మండే



## కుప్పకూలిన దేశీయ స్టాక్ మార్కెట్లు

### అమెరికాలో మాంద్యం భయాలు • సెన్సెక్స్ 2,222, నిఫ్టీ 662 పాయింట్లు పతనం

### ఒక్కరోజే రూ.15.32 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరి

ముంబై, ఆగస్టు 5: దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. సోమవారం ఉదయం ట్రేడింగ్ మొదలు.. మధ్యాహ్నం ముగిసే వరకు మదుపరులు అమ్మకాలకే పెద్దపీట వేశారు. మాంద్యం గుప్పిట్లోకి అగ్రరాజ్యం అమెరికా పోనున్నదన్న అంచనాలు.. మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. అలాగే ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధ మేఘాలు, ఇతరత్రా కారణాలూ ప్రతికూల ప్రభావం చూపాయి. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,222.55 పాయింట్లు లేదా 2.74 శాతం కోల్పోయి 80వేల మార్కుకు దిగువన 78,759.40 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 2,686.09 పాయింట్లు లేదా 3.31 శాతం పడిపోవడం గమనార్హం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 662.10 పాయింట్లు లేదా 2.68 శాతం దిగజారి 24,055.60 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో 824 పాయింట్లు లేదా 3.33 శాతం క్షీణించింది. అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ రెండింటికీ జూన్ 4 తర్వాత ఇదే అతిపెద్ద నష్టం. శుక్రవారం కూడా సెన్సెక్స్ 886, నిఫ్టీ 293 పాయింట్లు పతనమైన విషయం తెలిసిందే.

### కుదేలైన బ్యాంకింగ్, ఐటీ షేర్లు

**బ్యాంకింగ్,** ఐటీ, మెటల్, చమురు-గ్యాస్ రంగాల షేర్లలో భారీగా అమ్మకాల ఒత్తిడి నెలకొన్నది. నిజానికి అన్ని రంగాల సూచీల్లో సెల్లింగ్ ప్రెషర్ కనిపించింది. సేవా రంగం 4.56 శాతం, యుటిలిటీస్ 4.30 శాతం, రియల్టీ 4.25 శాతం, క్యాపిటల్ గూడ్స్ 4.13 శాతం, ఇండస్ట్రియల్స్ 4.08 శాతం, విద్యుత్తు 3.91 శాతం, చమురు-గ్యాస్ 3.88 శాతం, కమోడిటీస్ రంగ షేర్లు 3.82 శాతం చొప్పున నష్టపోయాయి. టాటా మోటర్స్ షేర్ల విలువ గరిష్ఠంగా 7 శాతానికిపైగా పడిపోయింది. ఇక బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 4.21 శాతం, మిడ్‌క్యాప్ 3.60 శాతం చొప్పున నష్టాలను చవిచూశాయి. బీఎస్ఈలో 3,414 షేర్లు నష్టాలకే పరిమితమయ్యాయి. 664 షేర్లు లాభపడగా, 111 షేర్లు యథాతథంగా ఉన్నాయి.

### సెన్సెక్స్ టాప్-10 నష్టాలు

| | |
|---|---|
| 2024 జూన్ 4న | 4,389.73 |
| 2020 మార్చి 23 | 3,934.72 |
| 2020 మార్చి 12 | 2,919.26 |
| 2020 మార్చి 16 | 2,713.41 |
| 2022 ఫిబ్రవరి 24 | 2,702.15 |
| 2024 ఆగస్టు 5 | 2,222.55 |
| 2020 మే 4 | 2,002.27 |
| 2020 మార్చి 9 | 1,941.67 |
| 2021 ఫిబ్రవరి 26 | 1,939.32 |
| 2022 ఫిబ్రవరి 14 | 1,747.08 |



### • గ్లోబల్ మార్కెట్లలో..

ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రధాన దేశాల స్టాక్ మార్కెట్లలో అలజడి చెలరేగింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు పెద్ద ఎత్తున క్షీణించాయి. ముఖ్యంగా జపాన్ సూచీ నికీ 12.4 శాతం పడిపోయింది. మునుపెన్నడూ లేనివిధంగా 4,451.28 పాయింట్లు దిగజారి 31,458.42 వద్ద స్థిరపడింది. 1987 అక్టోబర్ 19న 3,836 పాయింట్లు నష్టపోయింది. ఇప్పటిదాకా నికీకి ఇదే భారీ నష్టం. అమెరికా ఉద్యోగ గణాంకాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో అగ్రరాజ్యం మాంద్యం కోరల్లో చిక్కుకోనుందన్న భయాలు అంతటా వ్యాపించాయి. ఇది మదుపరులను పెట్టుబడుల ఉపసంహరణ దిశగా నడిపించింది. అటు ఐరోపా మార్కెట్లదీ ఇదే పరిస్థితి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ సూచీలు నేలచూపుల్నే చూస్తున్నాయి. ఇక అమెరికా సూచీలు పెద్ద ఎత్తున క్షీణిస్తున్నాయి.

**అమెరికాలో** తలెత్తిన మాంద్యం భయాలు.. ప్రపంచ మార్కెట్లలో పెను ప్రకంపనల్నే సృష్టించాయి. జపాన్ సెంట్రల్ బ్యాంక్ నిర్ణయాలతో కరెన్సీ మార్కెట్‌లో ఆ దేశ కరెన్సీ యెన్ విలువ పెరిగింది. రక్షణాత్మక ధోరణిని అవలంభిస్తున్న ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్ల క్రాష్‌కు కారకులయ్యారు.

**-వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్**

**అమెరికాలో** జూలై ఉద్యోగ గణాంకాల నివేదిక.. అక్కడ మాంద్యం సంకేతాలను మార్కెట్‌లోకి పంపించింది. భౌ గోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఈక్విటీ మా ర్కెట్లను కుప్పకూల్చాయి. ఇజ్రాయెల్-హమాస్ పోరులో ఇరాన్, అమెరికా జోక్యం.. పరిస్థితుల్ని మరింతగా దిగజార్చాయి.

**-అజిత్ బెనర్జీ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కో**

### సెన్సెక్స్ నెక్ట్స్30

**బీఎస్ఈ** అనుబంధ విభాగం ఆసియా ఇండెక్స్ సోమవారం సెన్సెక్స్ నెక్స్ట్ 30 పేరిట ఓ కొత్త సూచీని ప్రకటించింది. ఇది సెన్సెక్స్‌లో లేని బీఎస్ఈ టాప్-100 స్టాక్స్ పనితీరును ట్రాక్ చేయనున్నది. ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్స్యూమర్ డిస్క్రియేషనరీ, ఎనర్జీ, కమోడిటీస్, హెల్త్‌కేర్, ఇండస్ట్రీస్, ఎఫ్ఎంసీజీ, ఐటీ, యుటిలిటీస్ షేర్లు కొత్త ఇండెక్స్‌లో ఉంటాయి.



### 5 నష్టాలకు కారణాలు

- అమెరికా మాంద్యం భయాలు
- ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధ మేఘాలు
- పెద్ద ఎత్తున జపాన్ ఇన్వెస్టర్ల షేర్ల అమ్మకాలు
- భారతీయ సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉన్నందున ఏర్పడ్డ లాభాల స్వీకరణ
- నిరాశాజనక కార్పొరేట్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు

### 2 రోజుల్లో 20 లక్షల కోట్లు ఫట్

**స్టాక్ మార్కెట్ల** నష్టాలతో మదుపరులు లక్షల కోట్ల రూపాయల్లో కోల్పోవాల్సి వచ్చింది. బీఎస్ఈలో నమోదైన సంస్థల మార్కెట్ విలువ సోమవారం ఒక్కరోజే రూ.15.32 లక్షల కోట్లు హరించుకుపోయింది. అంతకుముందు శుక్రవారం కూడా నష్టాలు వాటిల్లగా ఈ రెండు రోజుల్లో మదుపరులు చేజార్చుకున్న సంపద విలువ రూ.19.78 లక్షల కోట్లుగా ఉండటం గమనార్హం. ప్రస్తుతం బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4,41,84,150.03 కోట్లు (5.27 ట్రిలియన్ డాలర్లు)గా ఉన్నది. ఈ ఒక్కరోజే రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.70,195 కోట్లు, టాటా మోటర్స్ మార్కెట్ విలువ రూ.42,461 కోట్లు ఆవిరైపోయింది.







# రూపాయి..ఢమాల్

## ఒకేరోజు 37 పైసలు పడిపోయిన విలువ

ముంబై, ఆగస్టు 5: దేశీయ కరెన్సీకి భారీగా చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు భారీగా కుదుపునకు లోనుకావడం, మధ్యతూర్పు దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో ఫారెక్స్ మార్కెట్లో అలజడికి కారణమైంది. దీంట్లోభాగంగా రూపాయి విలువ చారిత్రక కనిష్ఠ స్థాయి 84కి జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే మారకం విలువ సోమవారం ఒకేరోజు 37 పైసలు పడిపోయి 84.09 వద్ద ముగిసింది. 83.78 వద్ద ప్రారంభమైన రుపీ ట్రేడింగ్ ఇంట్రాడేలో 83.76 గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. 84కి పడిపోవడంతో ఫారెక్స్ మార్కెట్లో ఇదే తొలిసారి కావడం విశేషం.



## కంట్రోల్‌ఎస్ 400 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, ఆగస్టు 5: డాటా సెంటర్ల నిర్వహణ సంస్థ కంట్రోల్‌ఎస్..రూ.400 కోట్ల పెట్టుబడితో పాట్నాలో గ్రీన్‌ఫీల్డ్ డాటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం భూమిని కొనుగోలు చేసినట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. వెయ్యి మంది కూర్చోవడానికి వీలుండే ఈ డాటా సెంటర్ వచ్చే ఏడాది అందుబాటులోకి రానున్నట్లు పేర్కొంది. ఇప్పటికే సంస్థకు హైదరాబాద్‌తోపాటు ముంబై, నోయిడా, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, లక్నో, పాట్నాల్లో డాటా సెంటర్లు నిర్వహిస్తున్నది.

### ప్రియంకానున్న బ్రిటానియా ఉత్పత్తులు!

కోల్‌కతా, ఆగస్టు 5: మరోసారి ధరలు పెంచడానికి సిద్ధమైంది బ్రిటానియా ఇండస్ట్రీస్ లిమిటెడ్. ముడి సరుకుల ధరలతోపాటు కోకా, చక్కెర ధరలు అధికమవడంతో తమ ఉత్పత్తుల ధరల పెంచకతప్పడం లేదని బ్రిటానియా వైస్ చైర్మన్, ఎండీ వరుణ్ బెర్రీ తెలిపారు. ఏయే బ్రాండ్ల ధరలు పెంచేదానిపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, ఈ ముడి సరుకులు అత్యధికంగా వినియోగిస్తున్న ఉత్పత్తులను అతి త్వరలో పెంచనున్నట్లు చెప్పారు. ధరలు పెంచితే అమ్మకాలపై స్వల్పంగా ప్రభావం చూపే అవకాశం ఉన్నదని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత కస్టమర్లు చౌకైన ఉత్పత్తులవైపు మొగ్గుచూపే అవకాశాలున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కంపెనీ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిందని కొత్తగా 28 లక్షల అవుట్‌లెట్లకు ఉత్పత్తులను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

# రిలయన్స్ ర్యాంక్ @ 86

### ఫార్చ్యూన్ గ్లోబల్ 500 జాబితాలో

న్యూఢిల్లీ, ఆగస్టు 5: రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో ఖ్యాతిని సాధించింది. ఫార్చ్యూన్ గ్లోబల్ 500 జాబితాలో భారత్ నుంచి అత్యధిక ర్యాంక్‌ను పొందిన సంస్థగా రిలయన్స్ చరిత్ర సృష్టించింది. 2024కిగాను రిలయన్స్‌క 86వ స్థానం వరించింది. క్రితం ఏడాది వచ్చిన 88 ర్యాంక్‌తో పోలిస్తే రెండు ర్యాంకులు ఎగబాకి ఈ స్థానం దక్కించుకున్నది. గడిచిన మూడేండ్లలో తన ర్యాంక్‌ను 69 మెరుగుపరుచుకున్నది. 2021లో 155వ స్థానంలో ఉన్న రిలయన్స్..2024లో 86వ స్థానానికి ఎగబాకింది. గడిచిన 21 ఏండ్లుగా ఫార్చ్యూన్ 500 జాబితాలో రిలయన్స్ ఉండటం విశేషం. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను 108.8 బిలియన్ డాలర్ల ఆదాయంపై 8.4 బిలియన్ డాలర్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు ఈ జాబితాలో భారత్‌కు చెందిన తొమ్మిది సంస్థలకు చోటు లభించగా, వీటిలో ఐదు ప్రభుత్వరంగ సంస్థలు ఉండటం విశేషం. వీటిలో బీమా దిగ్గజం ఎల్ఐసీ తన ర్యాంక్‌ను 12 స్థానాలు మెరుగుపరుచుకొని 95వ స్థానానికి చేరుకున్నది.

### తొలిస్థానంలోనే వాల్‌మార్ట్

అమెరికా రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ తన తొలి స్థానాన్ని పదిలపరుచుకున్నది. వరుసగా 11వ సారి ఇదే స్థానంలో కొనసాగుతుండటం విశేషం. అలాగే అమెజాన్ ర్యాంక్ రెండు స్థానాలు ఎగబాకి రెండో స్థానానికి చేరుకున్నది. 2023లో రెండో స్థానంలో ఉన్న సౌదీ అరామ్‌కో ఈసారి నాలుగో స్థానానికి పడిపోయింది. చైనాకు చెందిన స్టేట్ గ్రిడ్‌కు మూడో స్థానం వరించింది.

### ఫార్చ్యూన్ గ్లోబల్ 500 జాబితాలో దేశీయ సంస్థలు



| కంపెనీ | ర్యాంక్ |
|---|---|
| రిలయన్స్ | 86 |
| ఎల్ఐసీ | 95 |
| ఐవోసీ | 116 |
| ఎస్బీఐ | 178 |
| ఓఎన్జీసీ | 180 |
| బీపీసీఎల్ | 258 |
| టాటా మోటర్స్ | 271 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 306 |
| రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ | 463 |

# ఎయిర్‌టెల్ లాభం మూడింతలు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ లాభాలు వాయువేగంతో దూసుకుపోయాయి. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.4,160 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.1,612.5 కోట్ల కంటే రెండున్నర రెట్లు అధికం. సమీక్ష కాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం 2.8 శాతం అధికమై రూ.38,506.4 కోట్లకు చేరుకున్నది.

- ఒక్కో కస్టమర్ డాటా వినియయం 23.7 జీబీలకు చేరుకున్నది.
- సరాసరిగా ఒక్కో కస్టమర్‌పై సమకూరే ఆదాయం 5.4 శాతం వృద్ధితో రూ.200 నుంచి రూ.211కి చేరుకున్నది.
- కంపెనీ రుణాలు 14 శాతం ఎగబాకి రూ.31,098 కోట్లకు చేరుకున్నాయి.

## 12 రూట్లలో ఇండిగో బిజినెస్ క్లాస్ సీట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగో..సరికొత్తగా బిజినెస్ క్లాస్ సీట్లను ప్రవేశపెట్టబోతున్నది. నవంబర్ 14 నుంచి అందుబాటులోకి రానున్న ఈ సీట్లను తొలి దశలో 12 రూట్లలో ప్రవేశపెట్టబోతున్నట్లు ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తెలిపారు. విమాన సేవలు ఆరంభించి 18 ఏండ్లు పూర్తైన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..బిజినెస్ క్లాస్ సీట్లతోపాటు అంతర్జాతీయ రూట్లలో విమానాల సంఖ్యను పెంచబోతున్నట్లు ప్రకటించారు. ఈ బిజినెస్ క్లాస్ టికెట్ ప్రారంభ ధరను రూ.18,018గా నిర్ణయించింది సంస్థ. ఏ321 నియో విమానాల్లో మూడు వరుసల్లో నాలుగు సీట్ల చొప్పున 12 సీట్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఈ విమానాల్లో మొత్తం సీట్లు 220 కాగా, దీంట్లో 12 బిజినెస్ సీట్లు, 208 ఎకానమి క్లాస్ సీట్లు. ఈ బిజినెస్ సీట్లు మంగళవారం నుంచి బుకింగ్ చేసుకోవచ్చునని సూచించారు. తొలి దశలో ఢిల్లీ-ముంబై రూట్లలో అందుబాటులోకి రానున్నది.

### చైనాలో తగ్గుతున్న వివాహాలు

**ఆందోళనలో అధికారులు!**

బీజింగ్: చైనాలో యువతీ, యువకులు వివాహ బంధంలో ప్రవేశించడానికి విముఖంగా ఉన్నారు. ఒకప్పుడు జనాభాను తగ్గించేందుకు కఠినంగా వ్యవహరించిన ప్రభుత్వం ఇప్పుడు పిల్లల్ని కన్నవారికి ప్రోత్సాహకాలు ఇస్తామన్నా యువత పట్టించుకోవడం లేదు. దీంతో జననాల రేటు పతనమవుతుండగా, వృద్ధుల రేటు పెరిగిపోతున్నది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో కేవలం 34 లక్షల జంటలు మాత్రమే వివాహం చేసుకున్నాయని, గత ఏడాది ఇదే కాలంలో 38.98 లక్షల జంటలు ఒక్కటయ్యాయని ఆ దేశ అధికారులు చెప్పారు. ఉద్యోగాల్లో స్థిరపడిన తర్వాతే పెండ్లి చేసుకోవాలని యువత భావిస్తుండటం పెద్ద సమస్యగా మారిందని వారు ఆందోళన చెందుతున్నారు. పెండ్లిండ్ల సంఖ్య 2014 నుంచి క్రమంగా తగ్గుతున్నదని, కొవిడ్-19 మహమ్మారి తర్వాత మరింత పతనమవుతున్నదని చైనా ప్రభుత్వం ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని, పెండ్లి చేసుకున్నవారికి, పిల్లలకు జన్మనిచ్చినవారికి ప్రోత్సాహకాలను ప్రకటించిందని అధికారులు చెప్పారు.

# కేజ్రీవాల్‌కు హైకోర్టులో చుక్కెదురు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. మద్యం పాలసీ కేసులో సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ సోమవారం తోసిపుచ్చారు. ఆయన బెయిల్ పిటిషన్‌ను కూడా కొట్టివేసిన హైకోర్టు.. బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లే అవకాశం కల్పించింది. అరెస్టు సవాల్ పిటిషన్, బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన కోర్టు తీర్పులను వరుసగా గత నెల 17, 29న రిజర్వ్ చేసింది. ఈడీ నమోదు చేసిన మనీలాండరింగ్ కేసులో తీహార్ జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను సీబీఐ జూన్ 26న అరెస్టు చేసింది.

### నేరానికి, విధాన నిర్ణయానికి మధ్య గీత ఎలా గీయాలి?

ఢిల్లీ మద్యం పాలసీలో అవినీతి, మనీ లాండరింగ్ ఆరోపణలతో ఈడీ అరెస్ట్ చేసిన మాజీ డిప్యూటీ సీఎం సిసోడియా బెయిల్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈడీకి పలు ప్రశ్నలను సంధించింది. నేరానికి, విధాన నిర్ణయానికి మధ్య విభజన రేఖ ఎలా గీయాలని ఈడీని ప్రశ్నించింది. ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వంలోని కేబినెట్ తీసుకున్న నిర్ణయంలో అనుమానాలు పెరగడానికి లాభాల్లో మార్జిన్‌లు పెరగడమే ప్రాతిపదిక అయితే మంత్రివర్గం ఎలా పనిచేస్తుందని జస్టిస్ బీఆర్ గవయ్, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌ల ధర్మాసనం ప్రశ్నించింది. ఇదిచట్టబద్ధమైన విధాన నిర్ణయాలు, నేర చర్యల మధ్య తేడాను ఎలా చూపుతుందని ప్రశ్నించింది.




ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న, లేదా ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా ఉండాలనే చర్య ఇతరులకు అసమాన లాభాలకు దారితీస్తుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

### ఆప్ సర్కారుకు సుప్రీంలో ఎదురుదెబ్బ

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో సభ్యులను నామినేట్ చేసే విషయంలో లెఫ్టినెంట్ గవర్నర్ ఢిల్లీ ప్రభుత్వ మంత్రిమండలి సలహాలను పాటించాల్సిన అవసరం లేదని సుప్రీం కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. ఎంసీడీలో 10 మంది సభ్యులను ఢిల్లీ మంత్రి మండలి సలహా తీసుకోకుండా ఏకపక్షంగా నియమిస్తూ ఢిల్లీ ఎల్జీ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసు వాదోపవాదాలు పూర్తయిన 15 నెలల అనంతరం సోమవారం తీర్పు వెలువరించింది. 1993లో సవరించిన ఢిల్లీ మున్సిపల్ చట్టం ప్రకారం లెఫ్టినెంట్ గవర్నర్ ఎంసీడీలో సభ్యులను నియమించవచ్చునని, దీనికి ప్రభుత్వ అనుమతి, సలహా అవసరం లేదని సుప్రీం కోర్టు పేర్కొంది.

### మానసిక అస్వస్థతతోనే ఆత్మహత్యా యత్నం

**అమెరికా మహిళ కేసులో బయటపడ్డ నిజం**



ముంబై ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర సింధుదుర్గ్ జిల్లా సావంత్ వాడి అడవిలో కనిపించిన అమెరికన్ మహిళ లలితా కుమార్ ఎస్కే కేసులో అసలు విషయం బయటపడింది. మానసిక అనారోగ్యంతో తానే ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించానని, తన భర్త తనను అడవిలో కట్టి వేసినట్టు అబద్ధం చెప్పానని ఆమె అంగీకరించింది. అయితే, అర్ధాంతరంగా జీవితాన్ని ముగించడం తప్పు అని భావించి, రక్షించమని తాను అరచినట్లు తెలిపింది. తనకు పెండ్లి కాలేదని, గత పదేళ్లుగా తమిళనాడులో ఉంటున్నానని ఆమె చెప్పింది. సోనుర్లీ అడవిలో గొలుసులతో బంధించబడిన లలిత కేసును దర్యాప్తు చేసినపుడు తమిళనాడు పోలీసులకు ఆమె చెప్పిన చిరునామా తప్పు అని తేలింది. ఆ మహిళ తన మాజీ భర్తగా పేర్కొన్న వ్యక్తి ఎవరూ తమిళనాడు చిరునామాలో లేనట్లు వెల్లడైంది. అమెరికన్ ఎంబసీ పర్యవేక్షించిన ఈ కేసులో లలితా కుమార్ నిజం ఒప్పుకోవడంతో రత్నగిరి పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

# నివురుగప్పిన నిప్పులా గల్ఫ్

- ఇజ్రాయెల్‌పై ఏ క్షణంలోనైనా దాడి!
- సిద్ధమైన ఇరాన్, హెజ్బొల్లా గ్రూపు
- జీ7 దేశాల మంత్రుల సమావేశంలో అమెరికా మంత్రి బ్లింకెన్ వెల్లడి

వాషింగ్టన్/టెహ్రాన్/టెల్‌అవీవ్, ఆగస్టు 5: ఇజ్రాయెల్-హమాస్ మధ్య గత పది నెలలుగా కొనసాగుతున్న యుద్ధం మరింత విస్తృతం కానున్నదనే అంచనాల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉంది. గతవారం ఇజ్రాయెల్ వేర్వేరుగా జరిపిన దాడుల్లో ఇరాన్‌లో హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా, లెబనాన్‌లోని బీరుట్‌లో హెజ్బొల్లా టాప్ కమాండర్ ఫాద్ షుక్రు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్, హెజ్బొల్లా ప్రకటించిన నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఏ క్షణంలో ఎక్కడి నుంచి దాడులు జరుగుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. తాజా పరిస్థితులపై అమెరికా విదేశాంగ శాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ జీ7 దేశాల మంత్రులతో మాట్లాడినట్టు సోమవారం అమెరికా మీడియా వెల్లడించింది. ఇరాన్, హెజ్బొల్లా రానున్న 24 నుంచి 48 గంటల్లో ఇజ్రాయెల్‌పై ఏ క్షణమైనా దాడి చేసే అవకాశం ఉన్నట్టు ఆయన చెప్పినట్టు తెలిపాయి. ఉద్రికత్తలను చల్లార్చేందుకు, దాడులను తగ్గించేందుకు ఇరాన్, హెజ్బొల్లాను ఒప్పించేలా అమెరికా ప్రయత్నం చేస్తున్నదని బ్లింకెన్ వారికి వివరించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, అందరూ సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేస్తూ జీ7 దేశాల విదేశాంగ మంత్రులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.



### ఇజ్రాయెల్‌ను తగిన విధంగా శిక్షిస్తాం: ఇరాన్

తాజా పరిణామాల నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి నస్సీర్ కనాని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాంతీయ ఉద్రిక్తతలు రెచ్చగొట్టాలని తాము అనుకోవడం లేదని, అయితే తదుపరి అస్థిరత పరిస్థితులను నియంత్రించేందుకు ఇజ్రాయెల్‌ను తగిన విధంగా శిక్షించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. తమ దేశ రాజధాని టెహ్రాన్‌లో హనియాను హత్య చేయడం అంతర్జాతీయ చట్ట ఉల్లంఘన అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ జాతీయ భద్రత, సార్వభౌమాధికారాన్ని సంరక్షించుకొనే హక్కు ఇరాన్‌కు ఉన్నదని అన్నారు.

**మాకు అండగా నిలవాలి: ఇజ్రాయెల్**

మరోవైపు ప్రస్తుత సమయంలో ఇజ్రాయెల్‌కు అండగా నిలవాలని ఆ దేశ రక్షణ శాఖ మంత్రి యోవ్ గాల్లంట్ తమ మిత్ర దేశాలను కోరారు. ఇరాన్, దాని మద్దతు గ్రూపుల నుంచి పొంచివున్న ముప్పుపై ఇటలీ రక్షణ శాఖ మంత్రితో మాట్లాడినట్టు గాల్లంట్ సోమవారం ఎక్స్ పోస్టులో వెల్లడించారు.

### ఉద్రిక్తతలతో పలు దేశాలు అప్రమత్తం

ఇజ్రాయెల్, లెబనాన్, పాలస్తీనాకు ప్రయాణాలు చేయొద్దని ఐర్లాండ్ ప్రధాన మంత్రి సిమన్ హారిస్ తమ దేశ పౌరులకు సూచించారు. లెబనాన్‌లోని తమ పౌరులు ఆ దేశాన్ని వీడాలని జపాన్ విదేశాంగ శాఖ కూడా హెచ్చరికలు చేసింది. ఇదేవిధంగా ఇప్పటికే పలు దేశాలు అడ్వైజరీ జారీచేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఈ నెల 7 వరకు తాము ఇరాన్, ఇరాక్ గగనతలాన్ని వినియోగించబోమని జర్మనీకి చెందిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ తెలిపింది. పశ్చిమాసియాలో తక్షణం ఉద్రిక్తతలు తగ్గాల్సిన అవసరం ఉన్నదని ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ తుర్క్ పిలుపునిచ్చారు.

### అమెరికా అధ్యక్షుడు బైడెన్ సమీక్ష

పశ్చిమాసియాలో తాజా పరిస్థితులపై సమీక్షించేందుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జాతీయ భద్రతా మండలితో సమావేశం కానున్నట్టు వైట్‌హైస్ వెల్లడించింది. జోర్డాన్ రాజు అబ్దుల్లాతోనూ ఆయన చర్చించనున్నట్టు తెలిపింది.